# గూటిలో చిలక

ప్రొద్దున్నే లేచి పళ్ళు తోముకుంటున్నాను. మా ఇంటికి నాలుగిళ్ళవతల నుంచి యేడుపులూ, పెడబొబ్బలూ వినిపించాయి. యేమిటో చూద్దామని వాకిట్లోకి వచ్చాను. నారాయణ ఇంటిముందు జనం గుమిగూడి వున్నారు. ఏం జరిగిందో నాకు బోధపడలేదు. ఇంతలోనే అమ్మ వచ్చింది అక్కణ్ణుంచి.

"యేమిటమ్మా?" అన్నాను ఆత్రంగా.

"యేముంది? నారాయణ భార్య పోయింది" అన్నది అమ్మ.

"యేమయిందేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"నీదంతా మరీ చోద్యం ఆ పిల్లకి భూమ్మీద నూకలు చెల్లాయి, పోయింది. నిందలేందే బొందెపోదని యేవో కారణాలుంటాయి. మొన్నబాగానేవుంది. నిన్న జ్వరం, ఇవ్వాళ పోయింది. ప్రాణం పోకడా, వాన రాకడా ఎవరికి తెలుస్తుంది? ప్చ్!" అమ్మ పెళపెళా వేదాంతం వల్లించింది.

గూటిలో చిలక ఎందుకు ఎగిరిపోయిందో అడక్కూడదు. అడిగినవాడు అజ్ఞానికింద జమ! నిజమే మరి. బుర్రలోకి కొంచెం వేదాంతం దట్టిస్తే ఎక్కడికక్కడ సరిపెట్టుకోవచ్చు. ప్రతి సంఘటనకి, కారణాలు వెతకడమనేది-అశాంతిని కొనితెచ్చుకోవడంతప్ప మరేం కాదు. అశాంతి కొనితెచ్చుకొనేవాణ్ణి అజ్ఞానేంఖర్మ, అడ్డగాడిద అన్నా చెల్లుతుంది.

నారాయణ భార్య పోయిందని విన్నాను. వెంటనే నాకు మా సుబ్బులు జ్ఞాపకానికి వస్తోంది. తీగ కదిపితే డొంకంతా కదిలినట్లు—దాని వెనక అనేక సంఘటనలు జ్ఞాపకానికి వస్తున్నాయి.

ఎంత వద్దనుకున్నా, దాని జ్ఞాపకాలు నన్ను వదలవు. వెంటాడుతూనే వున్నాయి.

సుబ్బులు నాకు చెల్లెలు, అమ్మకి మేం ముగ్గురు మగబిడ్డలం- తర్వాత అది కలిగింది. నా వెనకనే అది పుట్టింది గనక దాని చిన్న తనం నాకూ చిన్నతనమే అయినా-అది చిన్నతనంలో ఎట్లా వుండేదో నాకు ఇప్పటికీ జ్ఞాపకమే!

పెద్ద పెద్ద కళ్లూ, ఎర్రగా, ముద్దుగా, బొద్దుగా ఉండేది. అమ్మ తప్ప మిగతా వాళ్ళమంతా దాన్ని 'దుబ్బులూ' అని పిలిచే వాళ్ళం. పసిది, దానికేం తెలుసు - ఎట్లా పిలిచినా పలికేది. అమ్మ మాత్రం వింటే కోప్పడేది. "ఎందుకురా దాన్ని అట్లా పిలుస్తారు. చిన్నప్పుడు దానిలాగే మీరూ రుబ్బుడు గుండులా ఇంతలావు వున్నారు" అని.

తల్లి ఆరోగ్యంగా వుండాలేకాని, చనుబాలకు కంట్రోలు లేదు గదా! కడుపునిండా తాగుతారు. భయం, దిగులూ లేదు. పసిపిల్లలు ఎందుకుండరు లావుగా.

మందంగా వున్నవారు, కాస్త మంద బుద్ధులుగా ఉంటారని కొందరంటారు. కానీ, మా దుబ్బులు విషయంలో మట్టుకు అది నిజంకాదు. అది చాలా చురుకైంది. కరుకైంది కూడా. నేను మూడో క్లాసులో వున్నప్పుడు, అది ఒకటో క్లాసులోవుంది. ఐదో క్లాసులో ఇద్దరం కలుసుకున్నాం.

ఇద్దరం ఐదో క్లాసులో వుండగా ఒక సంఘటన జరిగింది. ఆ సంఘటన నిన్నో, మొన్నో జరిగినట్లుంది. టీచరు నన్ను ఏదో ప్రశ్న అడిగాడు. నేను చెప్పలేక పోయాను. సుబ్బుల్ని అడిగితే, అది ఠకీమని జవాబు చెప్పింది. సుబ్బుల్ని నాకు ముక్కు చెంపలు వెయ్యమన్నాడు టీచరు. అది మొదట మొరాయించింది. కాని టీచరు కళ్ళురిమి గదిమేసరికి తప్పించుకోలేక పోయింది. బెరుకు

బెరుకుగా నేవచ్చి ముక్కు చెంపలు వేసింది. అది చూసి క్లాసు క్లాసంతా గొల్లున నవ్వారు. అప్పుడు నా స్థితి ఎట్లా వుంటుందో ఎవరైనా వూహించవచ్చు. టీచర్ని కైమా కొడదామనిపించింది. మా దుబ్బులు ముండని నమిలి మింగేద్దామనిపించింది. బెల్ కొట్టగానే గబగబా బయటకువెళ్ళి నిలబడ్డాను. మా సుబ్బుల్ని ఎట్లా చితకతన్నాలో, మనసులో ఒకటి రెండుసార్లు రిహార్సలుకూడా చేసుకున్నాను. అది దగ్గరకు వచ్చింది. నేను చెయ్యికూడా ఎత్తలేదు. గొల్లుమని ఏడుపు లంకించుకుంది. దాన్ని సముదాయించడానికి తాతలు దిగివచ్చారు. నాకు జరిగిన అవమానానికి, నాకంటే అదే ఎక్కువ బాధపడింది.

ఆ యేడు నేనూ, సుబ్బులు ఇద్దరం ఐదోక్లాసు పాసయ్యాము. నాన్న నన్ను హైస్కూల్లో చేర్పించాలనుకున్నాడు. సుబ్బులు తనూ చదువుతానని మంకుపట్టు పట్టింది. మా ఊళ్ళోవున్న కన్వర్టెడ్ క్రిస్టియన్లు కొంతమంది తమ పిల్లల్ని మిషనరీ స్కూళ్ళలో చదివించే వాళ్ళు. ఆ పిల్లలతోపాటు హైస్కూల్లో చదవాలని దానిపట్టుదల. నాన్న యిష్టపడలేదు. దానికి ఎంత ఉక్రోషమొచ్చిందో యేమో, ఒక రోజంతా అన్నం నీళ్ళు ముట్టుకొనివుంటే ఒట్టు! అమ్మ ప్రాణం పాయసం వుడికినట్టు వుడికిపోయింది. "ఈ హఠయోగిముండ హఠం సాధిస్తోంది. నీళ్ళుకూడా ముట్టక చచ్చేట్టుంది. పోనీ వెళ్ళి చదువు కోనివ్వండి." అంటూ అమ్మ గట్టి సిఫార్సే చేసింది. నాన్న ఒప్పుకోక తప్పలేదు.

దాని సంబరం చూడాలేతప్ప చెప్పడానికి వీల్లేదు. బట్టలూ, అవీ సిద్ధమయ్యాయి. దానికి బట్టలు ఖర్చు తప్ప చదువు ఖర్చు యేమీ లేదు. నామమాత్రంగా డబ్బు తీసుకుని, అన్నంపెట్టి చదువు చెప్పేవాళ్లు మిషనరీలు.

హైస్కూల్లో చేరాక, ఎండకాలం సెలవుల్లో తప్ప దాన్ని చూడటం పడేదికాదు. దూరా బారమనో యేమో, మధ్యలో సెలవులకి వచ్చేదికాదు. ఏకంగా ఎండా కాలం సెలవులకి వచ్చేది.

సెలవులకి నాకంటే రెండురోజు లాలస్యంగా వచ్చింది. సుబ్బుల్ని చూస్తే నాకు ఆశ్చర్యమయింది. సుబ్బరంగా అది సన్నబడి పోయింది.

"అమ్మా సుబ్బులికి కండలు కరిగాయే" అంటూ చప్పట్లు కొట్టేను.

"పోనిద్దూ, ఆడపిల్లలు సన్నగా వుంటేనే నాజూగ్గా వుంటారు." అన్నది అమ్మ. మాట అయితే అన్నది కానీ, సుబ్బుల్ని చూసి అమ్మ బాధ పడ్డట్టే వుంది. సెలవుల్లో దాన్ని మామూలు మనిషిని చెయ్యడానికి అమ్మపడ్డ తాపత్రయం అంతా ఇంతా కాదు. రోజుకొక పిండివంటచేసి పెట్టింది. కానీ అది మామూలు 'దుబ్బులు' కాలేక పోయింది.

"యేం తిండి పెడతారే సుబ్బులు?" అన్నాను.

ఆ విషయం ఎత్తేసరికి దాని మొగం చిన్నబోయింది. "ఏదో ఒకటి నీకెందుకు?" అంటూ మూతి ముడుచుకుంది.

అమ్మ అడిగితే చెప్పింది. అది చెబుతూంటే వళ్ళు కంపర మెత్తింది. మొక్కజొన్నల సంకటీ, గంజీ —చత్ నేనయితే చదువు మానుకొని వుందును. దాంతోకూడా అదే మాట అన్నాను. "అమ్మా, బాగానే చెబుతావ్. నీకేం! యేదో ఒకటి తిని చదువుకోవాలి" అంది. దానికి చదువుమీదున్న అభిలాష అలాంటిది. అదేం ఖర్మో దాని ఆశ పూర్తిగా నెరవేరలేదు.

స్కూలు ఫైనల్‌లో నేను ఫెయిల్ అయ్యాను. అది మంచి మార్కులతో ఒడ్డెక్కింది. నేను ఫెయిల్ కావడంతో నాన్న చాలా నిరాశ చెందాడు. ఎలాగైనా నన్ను ఓ ఇంజనీరునుచేసి, నామీద చిన్న 'జాక్‌పాట్' కొట్టాలని ఆశించినట్టుంది. నేను ఫెయిల్ కావడం మూలానా, ఆ ఆశ కాస్త అడుగంటింది. ఆయన ఎంత బాధ పడ్డాడంటే - కాలేజీలో చేరతానని అడగడానికి సుబ్బులు సాహసించ

లేకపోయింది. చిన్నప్పటి మాదిరి కాదు. దానికీ ఇంగితజ్ఞానంవుంది. నాన్న తన్ను పై చదువులకు పంపడని తెలుసు. అందుకని అది గమ్మున వుండిపోయింది. మనసులో యేం మథన పడిందో — అది దానికే తెలుసు.

నేను మళ్ళీ స్కూలో చేరకుండా ప్రైవేటుగానే పరీక్షకు అప్పియర్ కావాలనుకున్నాను. అంటే సుబ్బులికీ, నాకూ కలిసి మెలిసి వుండే అవకాశం కలిగిందన్నమాట. అయినా నాదారి వేరు. దాని దారివేరు. నాకు క్లాసుపుస్తకాలతో కుస్తీ పట్టడంతో సరిపోయేది. దానికి నాలాగ పరీక్షల బెడదలేదుగనక లైబ్రరీనుంచి పుస్తకాలు తెప్పించుకొని కూర్చునేది. చలం, కుటుంబరావు, గోపీచంద్, మునిమాణిక్యం - అందర్నీ చదువుతోంది అది. అలా బేఫికర్‌గా చదువుతూ కూర్చోవడం చూస్తే, నాకు కాస్త మంటగానే వుండేది. అది అంతటితో ఆపలేదు. పుండుమీద కారం చల్లినట్టు, వున్నట్లుండి ఒకరోజు కథ ఒకటి రాసుకొచ్చి, నన్ను చూడమంది. కాన్వెంట్ ప్రాడక్ట్ కథ రాయడమంటే నాకు ఆశ్చర్యం కలిగింది. "నువ్వే రాశావా?" అన్నాను.

అది నావైపు చురచురా చూసి "మీనాన్న రాశాడను కున్నావా?" అంది. అంతరం తెలీకుండా అది నన్ను అనరాని మాటే అంది. దానికి కండలు కరిగాక కోపం పెరిగింది. నోరు మంచిది గాకుండా పోయింది. తెలిసి దానిజోలికి పోవడం నాదే అవివేకం.

సుబ్బులు ఆ కథని యేదో వారపత్రికకి పంపింది. అచ్చు కాలేదు. అచ్చుకాలేదుగనక అది మంచికథే అయ్యుంటుందని, చాలా యేళ్ళ తర్వాత నాకో అనుమానం కలిగింది.

ఆ యేడే నాన్న సుబ్బులుకు పెళ్ళి ప్రయత్నం మొదలు పెట్టాడు. ప్రారంభించిన వేళా విశేషమో యేమో, దానికి సంబంధం త్వరలోనే కుదిరింది. వరుడు అట్టే ఆస్తిపాస్తులున్నవాడు కాక

పోయినా, సుబ్బులు లాగే స్కూలుఫైనల్‌దాకా చదువుకున్నాడు. అబ్బాయి సలక్షణంగానే వున్నాడు. ఇంటిపట్టున వుండి వ్యవసాయం చేసుకుంటున్నాడు.

"సుబ్బులూ నీకీ సంబంధం నచ్చినట్టేనా?" అన్నాను.

"నాకు నచ్చినవాడూ, నన్ను మెచ్చినవాడూ నా మెడలో తాళి కట్టాలన్న గొంతెమ్మ కోర్కెలు నాకేం లేవులే" అన్నది నిర్లిప్తంగా.

సుబ్బులు మాటకేంగానీ అమ్మకి మట్టుకు ఈ సంబంధం అంతగా నచ్చినట్టులేదు. తన అయిష్టతని సణగడంద్వారా వ్యక్తం చేసింది. నాన్న దాన్ని ఖాతరు చెయ్యలేదు. ఖచ్చితంగా చెప్పాడు. "నీకేం, కూతురికి ఇంజనీరో, డాక్టరో కావాలంటావు. పదిహేను వేలో, ఇరవైవేలో దానికే ఖర్చుచేస్తే మగపిల్లల గతేంకావాలి?" అన్నాడు.

"ఇంజనీర్లూ, డాక్టర్లూ కావాలని నేను యేడ్వటంలేదు. మరీ గతిలేనట్టు దరిద్రపు కొంపల్లోకి తొయ్యవద్దంటున్నాను. దానికి అక్కడ సరిగ్గా జరక్కపోతే అది మళ్ళీ మన కొంపమీదే పడుతుంది. కన్న నేరానికి అప్పుడైనా దాని మంచిచెడ్డలు మనమే చూడాలి. ఎందుకొచ్చిన గొడవ ఇదంతా" అని అమ్మ వాదన.

నాన్న ఉలకనూలేదు, పలకనూలేదు. ఆయన తీర్పుకు అప్పీలు లేదు. ఆయన నిశ్చయించిన సంబంధంతోనే సుబ్బులు పెళ్ళి జరిగిపోయింది.

సుబ్బులు నాకు దూరమైపోయింది. ఆ యేడు నేను స్కూలు ఫైనల్ పాసయి కాలేజీలో చేరాను. నేను ఇంటర్మీడియేట్ పాస్ అయ్యేసరికి సుబ్బులు ఇద్దరు బిడ్డల తల్లి అయింది. రెండు కాన్పులూ మా ఇంట్లోనే జరిగాయి.

మూడో కానుపుకు మట్టుకు అది మా ఇంటికి రాలేదు. దాని సొంత ఇంట్లోనే పురుడు పోసుకుంది. అమ్మ అక్కడేవుండి మంచి

చెడ్డలు చూసింది. అమ్మ అక్కడనుంచి వచ్చాక "ఎట్లా వుందమ్మా సుబ్బులు?" అన్నాను.

"పెళ్ళయి అయిదేళ్ళు కాలేదు, అప్పుడే మూడు కాన్పులు ఎట్లావుంటుంది? చిక్కి సగమైపోయింది బిడ్డ" అన్నది దిగులుగా.

సుబ్బుల్ని నేను చూడక చాలా రోజులైంది, రెండో కాన్పుకి వచ్చినప్పుడు చూశాను. సుబ్బులు ఊరు దాని పెళ్ళప్పుడు చూశాను. తర్వాత వెళ్ళలేదు. ఒకటి రెండుసార్లు అది నన్ను వాళ్ళ ఊరికి రమ్మని బలవంతం చేసింది. నేను యేదో చెప్పి తప్పించుకున్నాను. "అయినా షావుకార్లు బీదవాళ్ళ ఇళ్ళకు వస్తారా!" అంటూ నిష్టూర మాడింది.

ఎందుకో వెళ్ళి సుబ్బుల్ని చూడానిపించింది. వీలయితే రెండు మూడురోజులుండి వద్దామని బయలుదేరాను. నేను వెళ్ళేసరికి పదకొండు గంటలైంది. ఇల్లు చూస్తే తాళం వేసివుంది. పక్కింటి వాళ్ళని వాకబుచేస్తే తోట దగ్గరకు వెళ్ళిందని చెప్పారు. తోట ఎక్కడుందో విచారించి, కాళ్ళీడ్చుకుంటూ అక్కడకు వెళ్ళాను. సుబ్బులు కూలీలతో కలుపు తీయిస్తోంది. పుట్టింటి వాళ్ళనిచూస్తే పుట్టెడు సంతోషం కలుగుతుందనుకుంటాను ఆడవాళ్ళకి. నన్నుచూసి మహదానందం పొందింది అది. కుశల ప్రశ్నలు వేసి "ఇంటికి పోదాంపద" అన్నది.

"పిల్లలేరీ?" అన్నాను.

సుబ్బులు కందిసాలుకేసి చూపింది. దాని సంపద అంతా కందిచెట్ల నీడలో వుంది. సుబ్బులువెళ్ళి చంటిబిడ్డను తీసుకుంది. పెద్దదానికి నాలుగోయేడనుకుంటాను. నడవగలదు. రెండోబిడ్డని నేను యెత్తుకున్నాను.

"ఎన్నేళ్ళు పాపకి?" అన్నాను.

"దానికా? నాలుగోనెల. బంగారుతల్లి, ఏడుపే యెరగదు. ఎక్కడేసినా పుస్తకంలా పడుకుంటుంది" అంటూ దారిపొడుగునా దాని పరాక్రమం వర్ణించి మురిసిపోతున్నది.

ఏడవడానికి చాలినంత శక్తి లేదేమో అని నా అనుమానం. సుబ్బులు ఇంటికొచ్చినాక గబగబా వంట మొదలెట్టి ఒంటిగంటకి పూర్తిచేసింది. పులగమూ, గోంగూర పచ్చడీ, పచ్చిపులుసూ.

నేను భోంచేస్తుండగా "ఇంట్లో పాడిలేదు. అవస్థగా వుంది" అన్నది. సుబ్బులు నాకు నెయ్యి వడ్డించలేదు. అందుకని సంజాయిషీ యిచ్చుకున్నట్టుంది.

నాకు ముద్దదిగడం కొంచెం కష్టమే అనిపించింది. పిల్లలు మాత్రం అపురాపురుమని తింటున్నారు.

"రోజూ పొలంనుంచి వచ్చి వంటచెయ్యాలా?" అన్నాను.

"ముప్పూటలా వంటలూ, వార్పులూ చేసుకుంటూ కూర్చుంటే అయినట్టే సంసారం. ఉదయం చేసుకున్నదే మధ్యాన్నం తింటాం-అక్కడికే తీరిక దొరకడంలేదు" అన్నది.

పిల్లలిద్దరూ అపురాపురుమని యెందుకు తింటున్నారో నాకు బోధపడింది. వేడిగావున్న భోజనంకూడా వాళ్ల ప్రాణాలకి 'స్పెషల్' కింద లెక్క.

నా భోజనం అయ్యాక మా బావ పొలంనుంచి వచ్చాడు. "ఎప్పుడొచ్చావ్? అంతా బాగున్నారా?" అంటూ పలకరించటం తప్ప నాతోబాటు కూర్చొని కాసేపు మాట్లాడటానికి, ఆయనకు తీరికేలేదు.

రాత్రి యేడింటివరకు ఆయన పత్తాలేడు. రాత్రి భోంచేసి వెన్నెల్లో మంచాలువేసి పడుకున్నాక, ఆయన తన ప్రణాళికలు వివరించడానికి మొదలెట్టాడు. ప్రణాళికలంటే— ఆయనకున్న పది

వేల రూపాయల బాకీని తీర్చడానికి వేసుకున్న ప్రణాళికలు. పంచ వర్ష ప్రణాళికల్లా, ప్రణాళికలు మట్టుకు బాగానే వున్నాయి.

"సోషలిజం వస్తే అందరికీ సుఖశాంతులు వుంటాయట. అవునా అన్నా?" అన్నది మా సుబ్బులు.

"ఇకచాల్లే నోరుమూసుకో" అన్నాడు మా బావ.

"సోషలిజం మాట యెత్తితే మీ బావకు మంట."

"ఎందుకూ?" అన్నాను నేను.

"సోషలిజమంటే మంట పుట్టడానికీ, కంపర మెత్తడానికీ మిల్లులూ, కార్లూ వుండ నవసరం లేదు. ఒక గజ్జికుక్కపిల్లా, ఒక గొడ్డు మేకా చాలు. మీ బావకి పదెకరాల పొలంవుంది. దానిమీద పదివేల అప్పు వుంటే మాత్రమేం!" అన్నది మా సుబ్బులు నవ్వుతూ.

"మాటిమాటికీ అప్పులున్నాయని యెత్తిపొడవ నవసరంలేదు. ఐదేళ్ళపాటు తాలిచూడు. అప్పులన్నీ తీర్చి మరో పదెకరాల పొలం కొనకపోతే అప్పుడను."

మా బావకి పెద్ద ఆశేవున్నది. తలకుమించిన అప్పులు తీర్చడమంటే - చిల్లులుపడ్డ కుండను నీటితో నింపడం లాంటిది. చెమటోడిస్తే అప్పులు తీరుతాయా యెక్కడన్నా! ఈ విషయం మా బావ గ్రహించినట్టు లేదు. ఆశ వున్నచోట అజ్ఞానమూ వుంటుంది మరి.

తెల్లవారినాక నాకు అక్కడ వుండాలని లేదు. అవును వుండి యేం చెయ్యను? వాళ్ళ పని పాటలకి ఆటంకం.

"వెళ్తానమ్మా" అన్నాను.

"వెళ్లిరా! బాగా పనులున్నప్పుడు వచ్చావు. ఏం పొద్దు పోతుంది యిక్కడ? ఈసారి వస్తే ఎండాకాలం రా. మాకూ తీరుబాటు వుంటుంది" అన్నది సుబ్బులు.

"అలాగే" అన్నాను.

నిజానికి మళ్ళీ ఎండాకాలం అక్కడికి వెళ్తాననుకోలేదు. కానీ వెళ్ళక తప్పలేదు. ఉన్నట్టుండి సుబ్బులికి సీరియస్‌గా వుందంటూ మనిషి వచ్చాడు. ఇంట్లో అందరం బయలుదేరాం. మేం వెళ్లే సరికి ఇంటినిండా జనం పోగై వున్నారు. డాక్టరు ఇంజక్షన్ యిస్తున్నాడు. సుబ్బులికి స్పృహలేదు. నాకు యేదో అంతా కలగావుంది. డాక్టరువెంట గుంపుని చీల్చుకొని బయటికి వచ్చాను. సుబ్బులు కండిషన్ ఎట్లా వుందో డాక్టర్ని అడుగుదామనుకున్నాను. కానీ గొంతు పెగల్లేదు. డాక్టరు నా పరిస్థితి అర్థం చేసుకున్నట్లుంది. నా వైపు తిరిగి పెదవి విరిచాడు.

"ఏం జబ్బు?" అన్నాను నూతిలో గొంతుకతో.

"ఏం చెప్పమంటారు. కాంప్లికేటెడ్ కేసు. మాల్‌న్యూట్రిషిన్ మనిషిని పీల్చి పిప్పిచేసింది. మనిషి సరయిన తిండి తీర్థాలు లేకపోతే యెన్నాళ్లు బతుకుతుంది?"

నా కడుపు భగ్గుమంది. ఇంట్లో అంతా ఒక్కసారి గొల్లుమన్నారు. సుబ్బులికి శాశ్వతమైన తీరుబాటు లభించింది. ఇక దానికి యే బాధలూ లేవు. అయినా యేడవకుండా వుండలేక పోయాను.

సుబ్బులు జ్ఞాపకంవస్తే యిప్పుడూ యేడుపు వస్తుంది. అవును యేడ్వటంతప్ప యేమీ చేతగానివాళ్ళం మనం.

---